## 18నుంచి నామినేషన్ల స్వీకరణ

• ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్

మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 16 : ఈనెల 18వ తేదీ నుంచి పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. నామినేషన్ల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ఆదివారం మినహాయించి 18 నుంచి 25వ తేదీ వరకు కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, నామినేషన్ల స్వీకరణలో ఐదు మందికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీ గుర్తింపు పొందిన అభ్యర్థులకు ఒక ప్రపోజర్, స్వతంత్ర అభ్యర్థులకు పది మంది ప్రపోజర్లు ఉండాలన్నారు. ప్రపోజర్లు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఓటుహక్కు పొంది ఉండాలని, బ్యాలెట్ పేపర్ చిహ్నాలు ఎన్నికల సంఘం నుంచి వస్తాయని, ఫొటోల విషయంలో అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 26న స్క్రూట్నీ, 29న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. తాజాగా బ్యాంక్ ఖాతా తెరవాలని, ఎన్నికల లావాదేవీలను ఆ ఖాత ద్వారానే జరపాలని సూచించారు. సమావేశంలో స్థానికల సంస్థ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీవో రవి, డీపీఆర్‌వో శ్రీనివాస్, పార్టీల నాయకులు అంజయ్య, రాజేందర్‌రెడ్డి, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

అనసూయమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్, ఏప్రిల్ 16 : మండలంలోని అమీన్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ అనసూయమ్మ(65) మంగళవారం మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పరామర్శించారు. సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

## బరువు తక్కువున్న పిల్లలకు మెరుగైన వైద్యం

బాలుడిని తల్లిదండ్రులకు అందజేస్తున్న వైద్యులు ప్రతిభ, లతాప్రియాంక నియోనేటల్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 16 : బరువు తక్కువ ఉన్న పిల్లలకు మహబూబ్‌నగర్‌లోని సుశ్రుత ప్రజా వైద్యశాలలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు దవాఖాన డైరెక్టర్, ప్ర ముఖ గైనకాలజిస్టు డాక్టర్ ప్రతి భ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సుశ్రుతా వైద్యశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిడ్జిల్ మండలంలోని వల్లభాపూర్‌కు చెందిన పూజ, మహేశ్ దంపతులకు నాలుగు నెలల కిందట శ్వాస తీసుకునేందుకు ఇబ్బందితోపాటు 790 గ్రాములతో బాబు పుట్టాడన్నారు. మెరుగైన వైద్యం కోసం తల్లిదండ్రులు సుశ్రు త ప్రజావైద్యశాలకు తీసుకురాగా, పరీక్షించిన వైద్యురాలు లతా ప్రియాంక నియోనేటల్ ఇన్‌టెన్సీవ్ కేర్ యూనిట్‌లో చేర్చి 75 రోజులపాటు వైద్యం అందించారన్నారు.

ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉండడంతో పాటు 700గ్రాములు బరువు పెరగడంతో మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి మెగా న్యూరో హెల్త్ క్యాంప్

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 16 : డా.జీవీకేఆర్ న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా న్యూరో హెల్త్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రముఖ న్యూరో డాక్టర్ జీవీకేఆర్ గౌడ్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రా జేంద్ర నగర్‌లో గల డాక్టర్ జీవీకేఆర్ న్యూరో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నరాల లోపాల సమస్యలున్న వారికి వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపా రు. ఈనెల 17, 18తేదీల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5:30గంటల వరకు మెగా క్యాంప్‌లో ప్రజలు వైద్యసేవలు వినియోగించుకోవాలని అన్నారు. తమ హాస్పిటల్‌లో 54 రకాల న్యూరో సంబంధిత రక్త పరీక్షలు చేయబడునున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలందరికీ మెరుగైన వైద్యసేవలు అందిస్తామని చెప్పారు.

## 29న జాతీయ సదస్సు

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్

పాలమూరు, ఏప్రిల్ 16 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతదేశ మత్స్యసాగు సుస్థిర అభివృద్ధికి ఆవిష్కరణలు, క్రయవిక్రయాలపై ఈనెల 29న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాలమూరు విశ్వవిద్యాలయంలో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మత్స్య పరిశ్రమకు దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందించేందుకు దీర్ఘకాలిక, సుస్థిరమైన పరిశ్రమలను స్థాపించడానికి సెమినార్లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి స్వాతి, అధ్యాపకులు ఉన్నారు.

### మహనీయుల మార్గం అనుసరణీయం

మహనీయులను స్మరించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, వారి మార్గాన్ని అనుసరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రం సమీపంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో మహానీయుల జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ హాజరై మాట్లాడారు. పూలే, అంబేద్కర్ ఎన్నో అసమానతలు చూశారని అన్నారు.

వాటన్నింటినీ రూపుమాపేందుకు ఎంతో కృషిచేశారని తెలిపారు. ఓయూ ప్రొఫెసర్లు శ్రీనివాసులు, బెల్లయ్య, నాగరాజు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో పాటుపడినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ కుమారస్వామి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఈసీ మెంబర్లు నూర్జహాన్, ఫణిప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, బషీర్‌అహ్మద్, భాస్కర్ పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

• నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

పారేవులలో ఇన్‌టేక్‌వెల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

మక్తల్ టౌన్, ఏప్రిల్ 16 : వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్‌మిట్టల్‌తో కలిసి మక్తల్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. చిట్యాలలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పనికి వచ్చిన వారి పేర్లను మస్టర్లో నమోదు చేయాలని సూచించారు. పారేవుల వద్ద కృష్ణానది నుంచి నీటిని సరఫరా చేసే ఇన్‌టేక్‌వెల్‌ను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంటేక్‌వెల్ వద్ద అదనంగా మోటర్లు బిగించాల్సిన అవసరమున్నదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నది నీటి మట్టం తగ్గితే తీసుకోవాల్సిన చర్యలకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పారేవుల వద్ద 10 ఎమ్ ఎల్‌డీ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించారు. అలాగే పట్టణ సమీపంలోని రైస్‌మిల్లులను కలెక్టర్ తనిఖీ చేసి సీఎమ్ ఆర్ డెలివరీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మక్తల్ ప్రభుత్వ దవాఖానను సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కాన్పుల సంఖ్య పెంచాలని, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కొత్తగా వచ్చిన స్టాఫ్‌నర్సుల్లో నెలకు 5మందిని నారాయణపేట ప్రభుత్వ దవాఖానకు పంపించి శిక్షణ ఇప్పించాలని సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్‌ను ఆదేశించారు. త్వరలోనే దవాఖానలో అవసరమైన అనస్థీషియాతో పాటు ఇతర వైద్యులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ వెంకట్‌రెడ్డి, డీఈ రాఘవేంద్ర ప్రసాద్, నారాయణపేట జిల్లా సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్, డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి, తాసీల్దార్ సువర్ణరాజ్, ఎంపీడీవో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

### రూ.86వేల నగదు పట్టివేత

నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మక్తల్ టౌన్/కృష్ణ, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మక్తల్ నియోజకవర్గంలో చేపట్టిన చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో మంగళవారం రూ.86వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు కృష్ణ ఎస్సై ఎండీ నవీద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందునా రూ.50వేలకు పైగా నగదు తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలను వద్ద ఉంచుకోవాలని సూచించారు. కర్ణాటక నుంచి ఊట్కూర్‌కు వస్తున్న కురువ అంజప్ప అనే వ్యక్తి వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.86,400 పట్టుబడినట్లు తెలిపారు.

### బాలిక అదృశ్యం : కేసు నమోదు

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 16 : మండలంలోని కోడ్గల్‌కు చెందిన అశ్విని(16) అదృశ్యమైనట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని కోడ్గల్‌కు చెందిన అశ్విని ఈనెల 15వ తేదీన లింగంపేటలో కుట్టుమిషిన్ పనికి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. తన కూతురు కనిపించటంలేదని, పోలేపల్లికి చెందిన కన్నా అనే యువకుడిపై అనుమానం వ్యక్తం చేస్తూ బాలిక తండ్రి మంగళవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అదుపు తప్పిన కారు..

జానంపేటలో వరి కుప్పలపైకి దూసుకెళ్లిన కారు

మూసాపేట, ఏప్రిల్ 16: మండలంలోని జానంపేట వద్ద జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి సర్వీస్ రోడ్డుపై ఉన్న వరి కుప్పలపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి, అన్వర్ ఇద్దరూ కలిసి కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు కారులో వెళ్తుండగా జానంపేట గ్రామానికి రాగానే కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టి, సర్వీస్ రోడ్డుపై రైతుల వరిధాన్యం కుప్పలపైకి దూసుకెళ్లింది. రైతులకు ఎలాంటి గాయాలు కాలేదు. కారులో ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఎల్‌అండ్‌టీ అంబులెన్స్‌లో జిల్లా దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎస్సై సుజాతను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

### మృతదేహం లభ్యం

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 16 : పట్టణ శివారులోని కొషిగుట్ట వద్ద వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పట్టణ శివారులోని కొషిగుట్ట వద్ద కుళ్లిపోయిన వ్యక్తి మృతదేహంతో దుర్గంధం వస్తుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం ఇంజేడు గ్రామానికి చెందిన కృష్ణమూర్తి(26)గా గుర్తించి, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృతుడి కుటుంబసభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల మార్చురీకి తరలించారు. మూడేండ్లుగా హైదరాబాద్‌లోని బాలానగర్ హెటిరో కంపెనీలో కృష్ణమూర్తి ఉద్యోగం చేస్తున్నాడని, ఈనెల 2వ తేదీన కంపెనీ పనిమీద వైజాగ్ వెళ్తున్నట్లు చెప్పాడని, ఈనెల 5వ తేదీ నుంచి ఫోన్ స్విచ్‌ఆఫ్ రావటంతో 11న దుండిగల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

నవాబ్‌పేట, ఏప్రిల్ 16 : మండలంలోని కాకర్ల పహాడ్ గేట్ వద్ద సోమవారం రాత్రి టిప్పర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి అక్రమంగా ఫిల్టర్ ద్వారా ఇసుకను తయారు చేసి జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారని, ఈమేరకు యజమాని సత్యనారాయణపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## సమిష్టిగా బీఆర్ఎస్‌ను గెలిపించాలి

బీఆర్ఎస్ కౌన్సిలర్లు, వార్డు కమిటీల సమావేశం

జడ్చర్ల టౌన్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య అన్నారు. మంగళవారం మండలంలోని పోలేపల్లి, కిష్టారం, ఖానాపూర్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికేతరులని.. స్థానికుడైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రఘుపతిరెడ్డి, నాయకులు ప్రణీల్ చందర్, శంకర్‌నాయక్, రవీందర్‌రెడ్డి, నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రాఘవేందర్‌గౌడ్, సత్యనారాయణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

### మెజార్టీ తీసుకొద్దాం..

జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో బీఆర్ఎస్‌కు మెజార్టీ తీసుకొద్దామని నాయకులు, కార్యకర్తలు తీర్మానించారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి స్వగృహంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు కమిటీలతో సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. ఈనె ల 22న జడ్చర్లలో నిర్వహించే సన్నాహక సమావేశానికి అన్ని వార్డుల నుంచి ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, మాజీ మార్కెట్ కమి టీ చైర్మన్లు మురళి, లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ రేణుక, నాయకులు రామ్మోహన్, శ్రీకాంత్, హఫీజ్, మొఖి ద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలి

కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

మూసాపేట, ఏప్రిల్ 16: బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ అన్నారు. మండలంలోని సంకలమద్ది గ్రా మ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం మం డల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పోల్కంప ల్లి, చక్రాపూర్, నిజాలపూర్ గ్రా మాల్లోనూ సమావేశం నిర్వహించి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎస్ఏ-2 పరీక్ష పరిశీలన

పాలమూరు, ఏప్రిల్ 16 : ఎస్ఏ-2 పరీక్షను మంగళవారం జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. పట్టణంలోని రెయిన్‌బో, అపెక్స్ పాఠశాలలో హిందీ పరీక్ష నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమంలో పీఆర్‌పీలు శ్రీనివాస్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### కలిసికట్టుగా పనిచేయాలి..

హన్వాడ, ఏప్రిల్ 16 : వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నదర్పల్లి సమీపంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

## నేడు కవి సమ్మేళనం

పాలమూరు, ఏప్రిల్ 16 : జిల్లా కేంద్రంలోని భారత్‌స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం సాయంత్రం 4గంటలకు తెలంగాణ మహిళా సాహిత్యం, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణవైభవం అనే అంశంపై కవిసమ్మేళనం నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు రావూరి వనజ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి పొద్దుటూరి ఎల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు.

## కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 16 : ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకోసం ప్రతి కార్యకర్త చురుగ్గా పనిచేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరి కృషితోనే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అదే విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించేలా పనిచేయాలన్నారు. బీజేపీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు కుటిన రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. ఈనెల 19వ తేదీన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు డీసీసీ జిల్లా అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, టీపీపీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రె డ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

### కార్యకర్తలు తరలిరావాలి

మక్తల్ టౌన్, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ఈనెల 19న వేసే నామినేషన్ కార్యక్రమానికి మక్తల్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజప్పగౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

## బలీదుపల్లిలో డీఎస్పీ విచారణ

బలీదుపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మూసాపేట(అడ్డాకుల), ఏప్రిల్ 16: అడ్డాకుల మండలంలోని బలీదుపల్లిలో రెండువర్గాల మధ్య జరిగిన ఘర్షణపై మంగళవారం మహబూబ్‌నగర్ డీస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బలీదుపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ గణేశ్ ఫిబ్రవరి 14న గ్రామ రోడ్డు పక్కన చలివేంద్రం ఏర్పాటు చేసేందుకు తడకలతో షెడ్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అయితే అక్కడ శివారెడ్డికి చెందిన భూమి ఉందని, షెడ్డు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని శివారెడ్డి భార్య భారతమ్మ వెళ్లి అడిగడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో ఆమె ఫోన్‌లో కుమారుడు రాంరెడ్డికి సమాచారం ఇవ్వడంతో, ఆయన అక్కడికి వెళ్లి షెడ్డును తొలగించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య జరిగిన ఘర్షణ విషయమై ఇరువర్గాలు అడ్డాకుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎంపీటీసీ గణేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంరెడ్డి, భారతమ్మపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. ఈ నేపథ్యంలోనే డీఎస్పీ వెంకటేశ్వర్లు కేసు విచారణ నిమిత్తం గ్రామంలోని సాక్షులతో విచారణ చేపట్టి, కేసుకు సంబంధించిన వివరాలపై ఆరా తీశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. కేసును పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

### తప్పుడు ప్రచారం మానుకోవాలి

ధన్వాడ, ఏప్రిల్ 16 : శాసనసభ ఎన్నికల్లో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామోహ్మన్‌రెడ్డికి బీజేపీ నాయకురాలు డీకే అరుణ మద్దతిచ్చారని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రచారం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేండ్లకోసారి నారాయణపేటకు వచ్చే శంశీచంద్‌రెడ్డికి ప్రజల కష్టాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు.

### రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ధన్వాడ, ఏప్రిల్ 16 : రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకుడు రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందన్నారు. రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నేడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ ముడోసారి అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాంచంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, ఉమేశ్‌కుమార్, శ్రీరామ్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అడిగిన ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' కల్పించాలి

పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసులు

దేవరకద్ర, ఏప్రిల్ 16: మండలంలోని ప్రతి గ్రామంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పనులు కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మల్లయ్యపాపయ్య కుంటలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. కూలీలు పనిచేసే ప్రదేశంలో నీడ కోసం టెంట్లు వేయాలని, గ్రామాల్లో జాబ్‌కార్డు ఉన్నవారికి, అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని చెప్పారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

భూత్పూర్, ఏప్రిల్ 16: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి అబ్దుల్ రబ్బు అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేసవికాలంలో ఎక్కువగా కలరా, మలేరియా వంటి జబ్బులు సోకే అవకాశం ఉందని, ఇండ్ల మధ్యన కంపచెట్లు, మురుగునీటి గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని,